క్లుప్తంగా

పండ్ల మొక్కలను కాపాడుకోండి


పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: రైతులు ఉపాధి హామీ పథకం కింద సాగు చేసుకున్న చీనీ, మామిడి తదితర పండ్ల మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం సూచించారు. మంగళవారం మేడికుర్తి గ్రామంలో రైతులు సాగు చేసుకున్న పండ్లమొక్కలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని జీజీఏ రికార్డులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

9న మండల సమావేశం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

వర్షాభావ పరిస్థితులను అధిగమించాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: వర్షాభావ పరిస్థితులతో సాగుచేసిన పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో బెట్టను అధిగమించేందుకు మందులు పిచికారీ చేసుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని మొలకలపెంటతండా, దోసలుడికి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లో బెట్టను ఎదుర్కొంటున్న పంటలను పరిశీలించారు. సమస్యను అధిగమించేందుకు పొటాషియం నైట్రేట్ (13:00:45) మందును ఐదు గ్రాములు లేదా యూరియా 10 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలుపుకుని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వర్షాధార పంటలైన కంది, ఆముదం పంటల్లో ఎక్కువసార్లు అంతర కృషి చేయడం వల్ల కలుపు నివారణతోపాటు నేలలో తేమశాతాన్ని కూడా రక్షించుకోవచ్చన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


మాట్లాడుతున్న అధ్యక్షుడు సత్య ప్రసాద్‌రెడ్డి

యల్లనూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు మంగళవారం తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తరఫున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్సానాకు రూ.5 వేలు, ఖాజాకు రూ.3 వేలు, మహేష్‌కు రూ.2 వేల నగదును తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్య ప్రసాద్‌రెడ్డి అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యుడు లోకేష్, ఉపాధ్యాయుడు సూర్యనారాయణ, పెన్షనర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నందలపాడులో ఉన్న సీఎస్ఐ చర్చి ఆరో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఫాదర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చిల్లో క్రైస్తవుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను చర్చి ఫాదర్లు సన్మానించారు.

నలుగురిపై కేసు

యాడికి: పొలం గట్టు వద్ద ఇరువర్గాల ఘర్షణ కేసులో ఒక వర్గానికి చెందిన నలుగురిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వెంగన్నపల్లెలో వైఎస్సార్‌సీపీకి చెందిన శివకేశవరెడ్డి, ఈశ్వరరెడ్డి, నందకిశోర్‌రెడ్డి, నరసింహారెడ్డికి టీడీపీకి చెందిన రామ సుధాకర్ ఈ నెల 5న పొలం గట్టు వద్ద ఘర్షణ పడ్డారు. మంగళవారం రామ సుధాకర్ ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దర్జాగా చెరువు మట్టి తరలింపు

- బరి తెగించిన 'తెలుగు తమ్ముళ్లు'
- అనుమతులు లేవంటున్న అధికారులు


చిత్రచేడు వద్ద చెరువులో నుంచి మట్టిని జేసీబీతో ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం

పెద్దవడుగూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. అనుమతి లేకుండా చెరువు మట్టి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. వివరాలు.. మండలంలోని చిత్రచేడు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వారం రోజులుగా గ్రామ సమీపంలో ఉన్న చెరువులోని మట్టిని జేసీబీతో ట్రాక్టర్లకు నింపుకుని తరలిస్తూ కాసులు దండుకుంటున్నారు. ఎక్కడైనా ఇసుక, ఇసుకతో కూడిన మట్టి, ఎర్రమట్టిని తరలించాలన్నా అధికారులు అనుమతులు తీసుకోవాలి. ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.800 దాకా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. 8 ట్రాక్టర్లతో రోజుకు 200 ట్రిప్పుల దాకా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామంలోని ఎవరైనా రైతులు మట్టి తోలుకోవడానికి వెళ్తే.. వారి ట్రాక్టర్లు రావడానికి వీలులేదని వెనక్కు పంపుతున్నారు. వారం రోజులుగా గ్రామంలో ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరమ్మను వివరణ కోరగా ఆ చెరువులో మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతి లేదన్నారు. గ్రామంలో పర్యటించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.


మట్టి తరలించడంతో ఏర్పడిన గుంతలు

తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైనవి


గుత్తిలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం

గుత్తి: తల్లి పాలు అత్యంత శ్రేష్ఠమైనవని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం అన్నారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చాకలిగేరి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుఖియా బేగం మాట్లాడుతూ తల్లి పాలలో రోగ నిరోధక శక్తిని పెంచే ఔషధ గుణాలు ఉంటాయన్నారు. ముర్రుపాలు తప్పనిసరిగా బిడ్డలకు తాపించాలన్నారు. అనంతరం చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు భావమ్మ, నాగరత్న,చంద్రలీల, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శింగనమల: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకూ పిల్లలకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఎంపీడీఓ రమణ, సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అవగాహన

గార్లదిన్నె: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మంగళవారం తెలిపారు. మంగళవారం కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.

అశ్వత్థంలో బహిరంగ వేలం


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో ఉన్న అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో తలనీలాలు, హోటల్ నిర్వహణ, కొబ్బరిచిప్పల పోగుచేసుకును హక్కు, క్రిష్ణస్వామి ఆలయ భూమి కౌలు కోసం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాబు నేతృత్వంతో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకును హక్కును వైఎస్సార్ జిల్లా బ్రంహ్మంగారి మఠానికి చెందిన సుబ్బరాయుడు రూ.4.10 లక్షలు, టెంకాయల చిప్పలు పోగుచేసుకును హక్కు తాడిపత్రి పట్టణానికి చెందిన సుబ్రమణ్యం రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. హోటల్ నిర్వహణ కోసం పెద్దపప్పూరుకు చెందిన లక్ష్మీదేవి రూ.1.54 లక్షలు, క్రిష్ణస్వామి ఆలయ భూమి కౌలును పెద్దపప్పూరుకు చెందిన ఎట్టి నాగరాజు రూ.21 వేలకు హక్కును సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఈఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కుష్టు లక్షణాలను గుర్తించండి

శింగనమల: గ్రామాల్లో పర్యటించి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, చికిత్స అందించాలని పీహెచ్‌సీ వైద్యుడు శంకర్‌నాయక్ సూచించారు. బుధవారం తరిమెల పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు సంబంధించి నివారణ చర్యలను వివరించారు. సీహెచ్‌ఓ గంగాధర, సిబ్బంది విజయలక్ష్మి, నాగమ్మ, హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుత్తి: కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించి నివేదిక అందజేయాలని డాక్టర్ ఎల్లారాముడు, కుష్టివ్యాధి సర్వే బృందం సభ్యులు ఆదేశించారు. గుత్తిలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో కుష్టు వ్యాధి సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నెలాఖరులోగా నూరు శాతం కుష్టువ్యాధి సర్వే పూర్తి కావాలన్నారు. అనంతరం సర్వే బృందం సభ్యులు మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో పర్యటించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

యాడికి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ పిలుపునిచ్చారు. ప్రజలకు అందిస్తున్న న్యాయ సేవలపై మంగళవారం యాడికి మండలంలోని పుప్పాల తండా గ్రామంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, యాడికి మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులుతో కలసి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమస్యలు ఉండి, ఆర్థిక స్థోమత లేని గిరిజనులకు ప్రభుత్వం ఉచిత న్యాయ సేవలను అందిస్తుందన్నారు. అనంతరం రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజన్, పెద్దవడుగూరు పీహెచ్‌సీ మహిళా వైద్యాధికారి గాయత్రి గ్రామంలో అందిస్తున్న ఉచిత సేవలను వారు పరిశీలించారు. శిబిరంలో 140 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ ఆనందబాబు, పంచాయతీ కార్యదర్శి వసుంధర, మండల విద్యాధికారి కాశెప్ప, సీఐ నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు తప్పనిసరి


గార్లదిన్నెలో మాట్లాడుతున్న వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి డాక్టర్ యుగంధర్

గార్లదిన్నె: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు అందించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఏఎన్ఎంలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలు, డయేరియా, మాతాశిశు సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఎలా చేయాలి అనే అంశాలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గౌతమి, హనీషా, సీహెచ్ఓ లోకనాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య ,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యల్లనూరు: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు అయ్యేలా ప్రతి ఒక్కరూ చూడాలని వైద్యాధికారి లోకేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా, ఏఎన్ఎంలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని సూచించారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్, పర్వీన్, రాజేంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని పెద్దపప్పూరు పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని అన్నారు. మంగళవారం మండలంలోని పసలూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


వేములపాడులో ఎండుతున్న పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

యాడికి: రైతులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మంగళవారం మండలంలోని వేములపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ, కొర్ర, కంది, పత్తి పంట పొలాలనుని సీపీఐ, రైతు సంఘం జిల్లా బృందం సభ్యులు పరిశీలించారు. వర్షం లేక పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. యాడికి కాలువకు నీరు వదిలి ఆదుకోవాలన్నారు. రైతులను ఆదుకోక పోతే జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంతకుముందు వారు సీపీఐ నాయకుడు వీకే ప్రదీప్ రెడ్డి, రైతు సంఘం నియోజక ఉపాధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి ఓబిరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజారెడ్డి, వెంకటరాముడుయాదవ్, మహమ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి జయంతి


సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

తాడిపత్రి అర్బన్: స్థానిక గాజుల కిష్టప్ప వీధిలోని సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు, భక్తులు సత్యనారాయణ స్వామి జయంతి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీ సమేత సత్యనారాయణ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. ప్రత్యేక హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 108 మంది దంపతులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో 67వ జాతీయ రహదారిపై మంగళవారం ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం గొందిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ రామాంజనేయులు మంగళవారం గుత్తిలో ప్రయాణికులను ఎక్కించుకుని రాయలచెరువు వైపుగా బయలుదేరాడు. తొండపాడులోని వాల్మీకి విగ్రహం వద్ద స్పీడ్ బ్రేకర్లను దాటించే క్రమంలో వాహన వేగాన్ని తగ్గించాడు. అదే సమయంలో వెనుకనే వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఘటనలో రోడ్డు పక్కకు ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న జక్కలచెరువుకు చెందిన శ్రీనివాసులు, హుస్సేన్‌పీరా, ఇసురాళ్లపల్లికి చెందిన లక్ష్మీదేవి, ఆటో డ్రైవర్ రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను మరో ఆటోలో గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు, లక్ష్మీదేవి, హుస్సేన్‌పీరాకు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం వైద్యశాలకు రెఫర్ చేశారు. కాగా, ప్రమాదానికి లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'నేతన్న నేస్తం' అమలు చేయాలి


మాట్లాడుతున్న నేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా పురుషోత్తం

పెద్దపప్పూరు: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్న నేస్తం అమలు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించాలని జిల్లా నేతకార్మిక సంఘం ఉపాధ్యక్షుడు చింతాపురుషోత్తం డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపప్పూరులోని హరేరామ ఆశ్రమంలో నేతకార్మిక సంఘం నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేసేదన్నారు. అలాగే ఈ ప్రభుత్వం కూడా నేతకార్మికుల సంక్షేమం కోసం ఆ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

హోరాహోరీగా అథ్లెటిక్స్

తాడిపత్రిటౌన్: స్థానిక ప్రభుత్వ కళాశాలలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. పోటీలను ఏటీఎల్ లలిత ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత బాలికల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో తాడిపత్రి నియోజకవర్గంలోని తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల్లోని దాదాపు 13 పాఠశాలలకు చెందిన దాదాపు 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు రన్నింగ్, సాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: అక్రమంగా రవాణా చేయిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెద్దపప్పూరు మండలంలోని వెంగంపేట గ్రామానికి చెందిన ప్రేమనాథరెడ్డి మంగళవారం సాయంత్రం ఎటువంటి బిల్లు లేకుండా మండలంలోని పాతపోలీస్‌స్టేషన్ గుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రేమనాథరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కంది పంట దున్నివేత

గుంతకల్లు రూరల్: దాయాదుల మధ్య ఉన్న భూ సమస్యల కారణంగా పచ్చని పంట పొలాన్ని దున్నేసిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని కసాపురం గ్రామంలో చోటు చేసుకుంది. కసాపురం గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతు అదే గ్రామంలోని మంగలి భీమక్కకు చెందిన మూడు ఎకరాలను ఎకరాకు రూ.5 వేల చొప్పున చెల్లించి కౌలుకు తీసుకున్నాడు. రూ.50 వేల దాకా ఖర్చుపెట్టి నెల రోజుల క్రితం కందిపంట సాగు చేశాడు. సోమవారం రాత్రి కొందరు వ్యక్తులు ట్రాక్టర్‌తో నాగరాజు సాగుచేసిన కందిపంటను పూర్తిగా దున్నేశారు. మంగళవారం ఉదయాన్నే పొలం వద్దకు చేరుకున్న నాగరాజు జరిగిన దారుణాన్ని చూసి లబోదిబోమన్నాడు. తనకు పొలాన్ని కౌలుకు ఇచ్చిన భీమక్క మరిది కుమారుడైన భీమప్ప కందిపంటను దున్నేసినట్లు తెలుసుకున్నాడు. వెంటనే భీమప్పకు ఫోన్‌చేసి విషయం అడుగగా ప్రస్తుతం కందిపంట సాగుచేసిన పొలం అన్నదమ్ముల పంచాయితీలో ఉందని, అందువల్లనే పంటను దున్నేశానని భీమప్ప తెలిపాడు. దీంతో తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కసాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి అర్బన్: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఎస్.రామాంజనేయులు(35)ను భార్య వదిలిపెట్టి పుట్టినింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన అతడు గత నెల 28న ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన ఇరుగు పొరుగు వారు అతడిని తాడిపత్రి ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతడి అన్న కుమారుడు ఆకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి టోల్ గేట్ వద్ద ఈ నెల 3న కారు డివైడర్‌కు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన భువనేశ్వరి(37) మంగళవారం ఆస్పత్రిలో మృతిచెందారు. ఎస్ఐ చిన్న రెడ్డప్ప వివరాల మేరకు.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో కలసి కారులో వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే ఆమెను హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ప్రమాదంలో ఆమె భర్త కార్తీక్, కుమారుడు, అత్త కూడా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా శ్రావణ మాస పూజలు


గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


తాడిపత్రిలో అలంకరణలో పంచముఖి ఆంజనేయస్వామి


ఆకు పూజ అలంకరణలో సాలగ్రామ ఆంజనేయస్వామి


యోగి వేమన ఆశ్రమంలో వడమాల అలంకరణలో ఆంజనేయస్వామి

తాడిపత్రి అర్బన్: ఆలయాల్లో మంగళవారం శ్రావణమాస పూజలు ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని మెయిన్‌బజార్, జింకావారి వీధిలోని పంచముఖి ఆంజనేయస్వామి, పెన్నానది ఆవలి వైపు ఉన్న సాలగ్రామ ఆంజనేయస్వామి ఆలయం, కడప రోడ్డులోని యోగి వేమన ఆశ్రమాల్లో పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మొదటి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని లచ్చానపల్లి రోడ్డులో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది, జగనన్న కాలనీవాసులు, సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

వర్షం కోసం జలాభిషేకం

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లిలో మంగళవారం గ్రామస్తులు వర్షం కోసం గ్రామదేవతలైన పెద్దమ్మ, పోతులయ్యలకు 108 బిందెల నీటితో అభిషేకం చేశారు.